క్లుప్తంగా

ఎస్సైకి సన్మానం



గార్ల : స్థానిక ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన నిమ్మతోట జీనత్‌కుమార్‌ను గురువారం మండల కాంగ్రెస్ నాయకులు గంగావత్ హరికిషన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎస్సైని కలిసిన వారిలో మాలోత్ మాన్‌సింగ్, గంగావత్ శ్రీను, భూక్యా మోహన్, భూక్యా బలరాం, తదితరులు ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కురవి: విద్యార్థులకు సంక్రాంతి సెలవులను ప్రభుత్వం ఇచ్చిందని, సెలవులను సద్వి నియోగం చేసుకుని బాగా చదువుకోవాలని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం డీసీఎస్ శర్మ, హెచ్‌డబ్ల్యూఓ పద్మ అన్నారు. గురువారం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని సూచించారు.

ఐదుగురి రిమాండ్

తొర్రూరు: పలు కేసుల్లో నిందితులుగా ఉండి కోర్టుకు హాజరుకాని ఐదుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. గుడుంబా, హత్యాయత్నం, దొంగతనం కేసుల్లో నిందితులుగా ఉన్న డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన వారు కోర్టు వాయిదాలకు గైర్హాజరవుతున్నారు. దీంతో వారిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గురువారం వరంగల్ సెంట్రల్ జైలుకు తరలించారు.

ఎక్సైజ్ శాఖ దాడులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని డోర్నకల్ మండలంలోని టేకులతండా, తోడేళ్లగూడెం, రావిగూడేల్లో గుడుంబా స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించామని ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి తెలిపారు. 600 లీటర్ల షుగర్ వాష్ ధ్వంసం చేసి, 15 లీటర్ల సారా సీజ్ చేశామన్నారు. సారా తయారు చేస్తున్న మంద వెంకన్న, మాలోతు బాబుపై కేసు నమోదు చేశామని తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై కృష్ణమూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన జనసమితి నాయకులు



మహబూబాబాద్ అర్బన్: డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్‌ను తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డోలి సత్యనారాయణ, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ గురువారం డోర్నకల్‌లో మర్యాదపూర్వకంగా కలిసి బొకేను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో జనసమితి పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఆరుద్ర పరమాత్మచారి, జిల్లా నాయకులు గాడిపెల్లి అనిల్, ఇరుగు మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులకు అండగా ఉండాలి

కురవి: పేదల కోసం నిరంతరం పోరాటం చేసే కమ్యూనిస్టు పార్టీలకు ప్రజలు అండగా ఉండాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుదాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో దూదికట్ల సారయ్య అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల హక్కుల కోసం పోరాటాలు చేయడం జరుగుతున్నదన్నారు. కార్యకర్తలు చురుకుగా పనిచేసి పార్టీని విస్తరించాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి రాజన్న, నాగేశ్వర్ రావు, సమ్మయ్య, వెంకన్న, రమేష్, సత్యం, నాగేశ్వర్‌రావు, ఉప్పలయ్య పాల్గొన్నారు.

అండగా ఉంటాం

పెద్దవంగర: కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.సుధాకర్‌రావు అన్నారు. మండలంలోని పోచారంలో ఇటీవల కూకట్ల సోమక్క అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ఆయన గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ముత్తినేని శ్రీనివాస్, వీరన్న, సర్పంచ్ లక్ష్మీబాలు నాయక్, శ్రీనివాస్ ఉన్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

కేసముద్రం: దళితబంధుకు ఎంపికైన నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలంటూ గురువారం తహసీల్దార్ కార్యాలయంలో పలువురు దళిత బంధు లబ్ధిదారులు వినతిపత్రాన్ని అందజేశారు. మహేందర్, కృష్ణమూర్తి, ఏలియా, మహేష్, ప్రవీణ్, శ్రీకాంత్, సుధాకర్, వీరన్న, సురేష్, శ్రీనివాస్, విద్యాసాగర్, సారంగం తదితరులు ఉన్నారు.

మరిపెడ రూరల్ : గాలివారిగూడెం యూపీఎస్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



తొర్రూరు రూరల్ : అమ్మాపురం పాఠశాలలో..



మహబూబాబాద్ అర్బన్ : విద్యార్థినులకు భోగిపండ్లు పోస్తున్న ఉపాధ్యాయులు



పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు

మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ముందస్తుగా సంక్రాంతి వేడుకలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా విద్యార్థినులు రంగురంగుల ముగ్గులు వేయగా, విద్యార్థులు గాలిపటాలను ఎగురవేశారు. రంగుల ముగ్గులు, బొమ్మల కొలువు, భోగిమంటలు, కోడి పందాలు, హరిదాసు వేషధారణలు, గంగిరెద్దుల సందడి, చిన్నారులకు భోగిపండ్లు పోయడం, చెరుకుగడల పందిరి, పాలను పొంగించడం లాంటి కార్యక్రమాలతో పండుగను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



తొర్రూరు : సిద్ధార్థ పాఠశాలలో సంబురాల్లో పాల్గొన్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు



పెద్దవంగర : ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



కురవి: రాజోలు స్కూల్‌లో..



మహబూబాబాద్ : గీతాంజలి హైస్కూల్‌లో..



చిన్నగూడూరు : చిన్నారులకు భోగి పండ్లను పోస్తున్న ఉపాధ్యాయులు



కేసముద్రం : శ్రీవివేకవర్థిని హైస్కూల్‌లో ..

పదిలో వందశాతం ఫలితాలు సాధించాలి

● ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

కురవి: పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించాలని ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డైరీలు, రికార్డులు, బేస్‌లైన్ పరీక్షాపత్రాలు, ఎఫ్‌ఏ–3, ఎఫ్‌ఏ–4 పరీక్షా పేపర్లను పరిశీలించారు. పదోతరగతి గదికి వెళ్లి మార్క్స్, రిజిష్టర్లను పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి ఉపాధ్యాయులతో చర్చించారు. ప్రతి యూనిట్‌పై రివ్యూ బోధన, స్లిప్‌టెస్ట్‌లు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట హెచ్‌ఎం ఎండీ.వాహిద్ ఉన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఆర్‌జేడీ

డోర్నకల్: మండలంలోని బొడ్రాయితండా ప్రాథమికోన్నత పాఠశాల, చిలుకోడు జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి తనిఖీ చేశారు. బొడ్రాయితండా పాఠశాలలో ఆయన తనిఖీ చేసే సమయంలో ముగ్గురు ఉపాధ్యాయులు ముందస్తు సమాచారం లేకుండా విధులకు హాజరు కాకపోవడం, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సరైన సమాచారం ఇవ్వకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ముగ్గురు ఉపాధ్యాయులతో పాటు హెచ్‌ఎంపై చర్య తీసుకోవాలని డీఈఓకు సూచించారు. చిలుకోడు జెడ్పీహెచ్‌ఎస్‌లో జరుగుతున్న కాంప్లెక్స్ స్థాయి ఉపాధ్యాయ సమావేశంలో ఉపాధ్యాయులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు.



కురవి: విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ

శ్రీరామ ఆలయంలో కుడారై మహోత్సవం

మహబూబాబాద్ రూరల్ : ధనుర్మాసవ్రత మహోత్సవ వేడుకల్లో భాగంగా పట్టణంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు ఎంవీ.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కుడారై మహోత్సవం జరిపారు. ప్రత్యేకంగా తయారు చేసిన ప్రసాదాన్ని గోదాదేవి అమ్మవారి సన్నిధిలో పాత్రల్లో ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. భక్తులు పూలు, పండ్లు, భక్తిశ్రద్ధలతో తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు.

‘మధుకర్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేదు’

బయ్యారం: బయ్యారం సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కంబాల ముసలయ్య అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌లో చేరకుండానే మధుకర్‌రెడ్డి గ్రూపులను ప్రోత్సహిస్తూ పార్టీకి చెడ్డపేరు తీసుకొస్తున్నారన్నారు. ఎంపీపీపై అవిశ్వాసం విషయంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి సూచనలకు విరుద్ధంగా ప్రత్యేక ప్యానల్‌ను తయారుచేసిన మధుకర్‌రెడ్డికి పార్టీతో సంబంధంలేదనే విషయాన్ని అధికారులు, మండల ప్రజలు గుర్తించాలన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జయశ్రీ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

గూడూరు: యువత చదువుతో పాటు క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో రాణించి గుర్తింపు తెచ్చుకోవాలని యువ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మూతి బద్రి అన్నారు. మండలంలోని మట్టెవాడలో ఇటీవల నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ క్రీడాకారులకు కిట్లు అందించారు. పాపారావు, రమేష్, ఆనంద్, వెంకటేశ్వర్లు, నాగయ్య పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

● గార్లలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ
● ఎమ్మెల్యే కోరం కనకయ్య



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

గార్ల: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం గార్లలోని రైతువేదిక భవనంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెళ్లి చేసుకున్న ఆడపిల్లలకు రూ.1,16,000 చెక్కుతో పాటు తులం బంగారం అందజేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో గార్ల మండలం తనకు అత్యధిక మెజారిటీ ఇచ్చిన మండల ప్రజలకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు విధుల పట్ల అంకితభావంతో పనిచేసి ప్రభుత్వంకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా మండలంలో 12 మందికి కల్యాణలక్ష్మి, ఒకరికి షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం ఇటీవల మృతి చెందిన వేంకటేశ్వరస్వామి దేవాలయం అర్చకుడు మధుస్వామి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఉపసర్పంచ్ అజ్మీర బన్సీలాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, వైస్ ఎంపీపీ కట్టిబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు వెంకట్‌లాల్, పి సుజాత, నాగరాజు, తహసీల్దార్ కె స్వాతిబిందు, ఎంపీడీఓ జి రవీందర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు గుండా వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

జోడో న్యాయయాత్రకు మద్దతు ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్ : ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ తలపెట్టనున్న భారత్ జోడో న్యాయ యాత్రకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని తెలంగాణ కాంగ్రెస్ గిరిజన విభాగం సీనియర్ నాయకుడు రాయపురం సాంబయ్య కోరారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత పదేళ్ల నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశ వనరులను కొంతమంది అభివృద్ధి కోసమే కేటాయిస్తుందన్నారు. కొంతమంది స్వలాభం కోసం పనిచేస్తున్న బీజేపీ పార్టీని అధికారం నుంచి దింపి వేయాలంటే ప్రతి సామాజిక వర్గం ప్రతి ఒక్కరు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కష్టపడి పనిచేసి మార్పు తీసుకురావాలని కోరారు. ఈ యాత్ర ద్వారా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి రాహుల్ గాంధీకి ఇండియా కూటమికి మద్దతుగా నిలిచి కేంద్రంలో మార్పు తేవాలని కోరారు. కార్యక్రమంలో కట్ల పాపయ్య రాయపురం సంపత్, కోట ఎల్లేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు సాంబయ్య

ప్రెస్‌మీట్ ఎందుకు పెడుతున్నారని వాగ్వాదం



కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

బయ్యారం: తమకు తెలియకుండా ప్రెస్‌మీట్ ఎందుకు పెడుతున్నారని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ వర్గం నాయకులు బయ్యారంలోని పార్టీ కార్యాలయంలో గురువారం వాగ్వాదానికి దిగడం ఉద్రిక్తతకు దారితీసింది. పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంబాల ముసలయ్య విలేకరులకు సమాచారం అందజేశారు. దీంతో ప్రెస్‌మీట్‌కు విలేకరులు వెళ్లిన సమయానికి కార్యాలయానికి వచ్చిన పార్టీ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, బయ్యారం ఎంపీటీసీ శైలజ, సొసైటీ డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, భాస్కర్‌రావు లు తమ అనుచరులతో వచ్చారు. తమకు తెలియకుండా ప్రెస్‌మీట్ ఎందుకు పెడుతున్నారని తీవ్రస్థాయిలో మండల, పట్టణ అధ్యక్షులను ప్రశ్నించటంతో ఆ సమయంలో ఇరుపక్షాల మధ్య వాగ్వాదం పెరిగింది. ఎస్సై ఉపేందర్ కార్యాలయానికి చేరుకొని ఆందోళనకు దిగిన వారిని అక్కడి నుంచి పంపివేయటంతో వివాదం సద్దుమణిగింది. అధికారం వచ్చిన నెలరోజుల్లోనే కాంగ్రెస్ నేతలు వివాదాలకు దిగటంతో రానున్న రోజుల్లో పార్టీ పరిస్థితి ఎలా ఉంటుందోననే సందేహాలను పార్టీ సీనియర్ నాయకులు వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

మహబూబాబాద్ అర్బన్ : విద్యార్థులు సోషల్ మీడియాలో కాకుండా చదువుపై దృష్టి సారించాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సురేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహంలో గురువారం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగం కల్పించిన చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉన్నప్పుడే తప్పులు చేయకుండా ఉంటారన్నారు. యువత గంజాయి, మద్యం, వ్యసనాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో వార్డెన్లు యాలాద్రి, రోజానీలా, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సురేష్

సంక్షిప్త సమాచారం

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

గూడూరు: తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలేను ప్రతి ఒక్క మహిళ ఆదర్శంగా తీసుకోవాలని సీడీపీఓ నీలోఫర్ అజ్మీ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం మూడు మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల ఉత్సవాలను పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

కేసముద్రం: మండల కేంద్రంలో పీఆర్‌టీయూ–2024 క్యాలెండర్లను ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బీరం జనార్దన్‌రెడ్డి, గోపాల శ్రీధర్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు హరినాథ్, మండల ఉపాధ్యక్షుడు ఉమేశ్వర్, లక్ష్మీనారాయణ, బిక్షపతి, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

నేను సైతం క్యాలెండర్ ఆవిష్కరణ

నెహ్రూసెంటర్ : నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పచ్చదనం పరిరక్షణ కొరకు సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

లాల్ బహదూర్ శాస్త్రీ వర్ధంతి

గంగారం : మండలంలోని మడగూడెంలోని ప్రభుత్వ ట్రైబల్ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ లాల్ బహదూర్ శాస్త్రీ, హైమండార్ఫ్ వర్ధంతిని నిర్వహించారు. అనంతరం వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

శబరిమలకు అయ్యప్పస్వాములు

గూడూరు: మండల కేంద్రం నుంచి 18 మంది అయ్యప్పస్వాములు గురువారం పూజలు ముగించి కేరళలోని శబరికి బయలుదేరి వెళ్లారు. ఉదయం 8 గంటల నుంచి స్థానిక సనాతన శివాలయంలో గురుస్వామి నరేష్‌శాస్త్రి ఆధ్వర్యంలో కుటుంబ సభ్యుల మధ్య అయ్యప్పస్వామి మొక్కు ఇరుముడిని కట్టుకొని, స్వామియే శరణం అయ్యప్ప అంటూ వీధుల వెంట వెళ్లారు.

మహబూబాబాద్ రూరల్ : శబరిమలై అయ్యప్ప స్వామివారి దర్శనానికి పట్టణంలోని అయ్యప్ప దేవాలయం నుంచి 40 మంది స్వాములు ఇరుముడి కట్టుకుని గురువారం తరలివెళ్లారు.


బీఆర్‌ఎస్ నియంతపాలనకు చరమగీతం

చిన్నగూడూరు: రాష్ట్రంలో నియంతపాలనకు ప్రజలు చరమగీతం పాడి ప్రజాపాలనకు మద్దతు పలికారని డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్, మండల అధ్యక్షుడు మారబోయిన వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం గెలిచిందని ప్రజలు సరైన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. మా ఎమ్మెల్యే మేధావి అని ఆయన ఆధ్వర్యంలో డోర్నకల్ అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రహరీ నిర్మించాలి

గార్ల : ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించాలని కోరుతూ గురువారం పీడీఎస్‌యూ మండల ప్రధాన కార్యదర్శి ఎం.మహేష్‌కుమార్ ఎమ్మెల్యే కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళలో మందుబాబులకు అడ్డాగా మారిందన్నారు.

కేసముద్రం విలేజ్ రెడ్డి సంఘం కమిటీ ఎన్నిక



రఘోత్తంరెడ్డి

కేసముద్రం: కేసముద్రం విలేజ్ రెడ్డి సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ముదిరెడ్డి రఘోత్తంరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. గురువారం రెడ్డి సంఘం 12వ సర్వసభ్య సమావేశం ఈ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల అధికారులు పాదిల వెంకట్‌రెడ్డి, పోలెపల్లి వెంకట్‌రెడ్డి, మారం సమ్మిరెడ్డి సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు. సంఘం ఉపాధ్యక్షుడిగా పోలెపల్లి చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి కాంతాల వెంకట్‌రెడ్డి, సహాయ కార్యదర్శి తిరుపతిరెడ్డి, కోశాధికారి సంకు శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ సలహాదారులుగా రావుల రాజేశ్వర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు.

మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేయాలి

గూడూరు: మండల కేంద్రంలో అదనంగా మరో 4 మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ మండల కన్వీనర్ తాటి అరుణ్‌కుమార్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ మండల కేంద్రమైన గూడూరులో జనాభాకు సరిపోను మీ సేవా కేంద్రాలు ఏర్పాటు లేక ఎంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ముందుంటుంది

నెల్లికుదురు: విద్యారంగ సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ఎప్పుడు ముందుంటుందని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు యుగేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో గురువారం సంఘ సభ్యులతో కలిసి పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మండలంలోని మేచరాజుపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్రం క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి రమేష్ ఆవిష్కరించారు.

వాహనాల వేలంలో రూ.17 లక్షల ఆదాయం

గూడూరు : స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పలు వాహనాల వేలం పాటలో ప్రభుత్వానికి రూ.17.6 లక్షల ఆదాయం వచ్చిందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.కిరణ్ తెలిపారు. గూడూరు శాఖ ఆధ్వర్యంలో గత రెండు దేళ్లగా నిర్వహించిన నాటుసారా, నల్లబెల్లం అక్రమ రవాణ కేసుల్లో 40 వాహనాలు పట్టుబడ్డాయన్నారు. వాటిని వేలం వేయగా, అందులో 27 వాహనాలకు రూ.14,50,500, జీఎస్టీ రూ.2,55,690 వచ్చాయని తెలిపారు. వేలంలో గూడూరు, నర్సంపేట, భూపాలపల్లి, మహబూబాబాద్, హైదరాబాద్, మణుగూరు, హనుమకొండకు చెందిన 100 మంది వ్యక్తులు పాల్గొన్నారు.

లోపాలపై కమిటీని ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్ రూరల్ : బీఆర్‌ఎస్ పాలనలో ధ్వంసమైన విద్యావ్యవస్థను పునర్నిర్మించాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు శంతన్ రామరాజు గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవస్థ అభివృద్ధికి వెన్నుముక అయిన విద్యావ్యవస్థ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురైందన్నారు. కాంగ్రెస్ పాలనలో నిర్మించిన స్కూళ్లకు కనీసం రంగులు వెయ్యలేని దుస్థితి నెలకొందని విచారం వ్యక్తం చేశారు. విద్యా వైద్యం అనేవి ప్రజల ప్రాథమిక హక్కు అని వీటిని గత ప్రభుత్వాలు వ్యాపార రంగాలుగా మార్చాయన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

కేసముద్రం: బాలికలు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలమాస అరుణ అన్నారు. ఇనుగుర్తిలోని జెడ్పీఎస్ఎస్‌లో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో బేటీ పడావోపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాలికలు తమకున్న హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులకు పోటీలను నిర్వహించి, బహుమతులను అందజేశారు.

ఇళ్ల స్థలాలను చూపాలంటూ ధర్నా

కేసముద్రం: మండలంలోని భుక్యారాంతండా జీపీ, కేసముద్రం విలేజ్ పరిధిలోని 399/1 సర్వేనంబర్‌ని భూమిలో తమకు ఇళ్ల స్థలాలను చూపాలంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పలు వురు ధర్నాకు దిగారు. ఇటీవల 45 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, కాని స్థలాలను చూపకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఆరోపించారు. అనంతరం వినతి పత్రాన్ని అందజేశారు.

తొలితరం నాయకుడిని కోల్పోయాం

తొర్రూరు రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని కంఠాయపాలెం గ్రామానికి చెందిన తొలితరం కమ్యూనిస్ట్ నాయకుడు పెరబోయిన భిక్షపతిని కోల్పోయామని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వర్‌రావు అన్నారు.. గురువారం మండలంలోని కంఠాయపాలెంలో భిక్షపతి మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

స్నాక్స్, బిస్కెట్స్‌కు నగదు అందజేత

కురవి: సీరోలు మండలం కాంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో సాయంత్రం వేళ జరుగుతున్న ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్, బిస్కెట్స్ అందించేందుకు గ్రామఉద్యోగుల సంఘం కన్వీనర్ ఆధ్వర్యంలో ఉద్యోగుల సహకారంతో రూ.12 వేలను గురువారం విద్యార్థులకు అందజేశారు. ఉద్యోగుల కన్వీనర్ బొందిలి వెంకన్న నేతృత్వంలో గ్రామంలో ఉన్న ఉద్యోగుల సహకారంతో రూ.12వేలను సేకరించి పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీలతకు అందచేశారు.

ఓబన్న జయంతి నిర్వహణ అభినందనీయం

మహబూబాబాద్ రూరల్ : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గర్వకారణమని టీపీసీసీ ఓబీసీ విభాగం రాష్ట్ర సంయుక్త కోఆర్డినేటర్ రాందాసు అన్నారు. ఓబన్న జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల గుండెల్లో గునపాలు దింపిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రధాన అనుచరుడుగా ఉన్న చరిత్రను వెలికితీయడం ఎంతో గొప్పతనమన్నారు.

రేపు ఆలయ ప్రథమ వార్షికోత్సవం

మరిపెడ రూరల్: గిరిజనుల ఆరాధ్యదైవం అయిన బంగారు మైసమ్మ తల్లి దేవాలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఈ నెల 13న మండలంలోని వెంకట్యతండ గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించనున్నారు. 13న పూజలు, అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో ఉంటుందని ఆయల కమిటీ చైర్మన్, స్థానిక సర్పంచ్ సూర్యనాయక్ తెలిపారు. 14న మైసమ్మతల్లికి జంతుబలిచ్చి భక్తులు మొక్కలు తీర్చుకుంటారు. ప్రజలు వేలాదిగా తరలివచ్చి మైసమ్మతల్లిని దర్శించుకోవాలన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

చిన్నగూడూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. డీఈఓగా కాయిత సాత్విక్, హెచ్‌ఎంగా నూకల గంగోత్రి వ్యవహరించారు.

చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

నెల్లికుదురు: ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి ఓ గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ఎర్రబెల్లిగూడెంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పాదిల సాయిమల్లు (50) రోజుమాదిరిగానే తాటిచెట్టుకు కల్లు గీసేందుకు వెళ్లాడు. చెట్టు ఎక్కి కల్లు తీసుకుని దిగుతుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు చుట్టుపక్కల రైతులు తెలిపారు.